ప్రజాశక్తి
బుధవారం 14 ఆగస్టు 2024
5
విజయనగరం

జ్యూట్ పరిశ్రమలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో జ్యూట్ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ జ్యూట్ అసోసియేషన్ సభ్యులు కిమిడి నాగార్జున, టివిఎస్ లింగమూర్తి, సునీల్ భారరియా, హర్ష నహత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి వినతినిచ్చారు. రాష్ట్రంలో జూట్ పరిశ్రమలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయని, కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించి పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. ఎంపి సానుకూలంగా స్పందించి ఉత్తరాంధ్రలో పరిశ్రమలు బాగు కోసం బాధ్యతగా తీసుకుంటానని, సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడుతానని తెలిపారు.

కేంద్రమంత్రికి వినతినిస్తున్న నాగార్జున

అన్నదాత ఆశలు ఆవిరి

మెరకముడిదాం మండలంలో ఎండిపోతున్న వరినాట్లు

ముఖం చాటేసిన వరుణుడు

52శాతం మించని ఉబాలు

అయోమయంలో రైతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

భగ భగ మండుతున్న ఎండలతో అన్నదాత ఆశలు ఆవిరవుతున్నాయి. నిన్నమొన్నటి వరకు గంపెడు ఆశలతో సేద్యంలోకి దిగిన అన్నదాత నేడు ఆశ, నిరాశల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. పుట్టెడు ఆనందంతో వరి నారు పోసిన రైతు అవి మొలకెత్తి, పెరిగే సమయానికి వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో, నారు ఎండకు మలమలమాడిపోతోంది. ఇప్పటివరకూ 6 మండలాల్లో 25శాతం లోపు నాట్లు పడగా, మరో 17 మండలాల్లో 50శాతం లోపు నాట్లు పడ్డాయి. దీంతో జిల్లాలో ఖరీఫ్ సాగు పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. మరోవైపు నారును బతికించు కునేందుకు అన్నదాత పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు. ఇంకోవైపు రైతులకు బ్యాంకు రుణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఇందులోనూ చాలా వరకు పాత రుణాలు రీ-షెడ్యూల్ మాత్రమే చేస్తున్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు అదనపు కష్టం దాపురించింది. వారికి రుణాలు అందజేసేందుకు బ్యాంకర్లు మోకాళ్లు ఒడ్డుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలన్నీ కలుపుకుని 2,22,538 ఎకరాల్లో వరి సాగువుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 1,15,184 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. జిల్లా మొత్తంగా 52శాతం మాత్రమే ఇప్పటివరకు ఉబాలు జరిగాయి. రైతులు ఖరీఫ్ సాగుకు సంబంధించి అవసరమైన ఎరువులను సిద్ధం చేసు కున్నారు. సాగుచేసే విస్తీర్ణాన్ని బట్టి రూ.వేల నుంచి రూ.లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. కానీ, ఆగస్టులో వర్షపాతం లోటు వల్ల నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో, ఉబాలు నిన్నమొన్నటి వరకు నత్తనడకనైనా సాగినప్పటికీ ప్రస్తుతం నాట్లు పడడం లేదు. ఇది కూడా అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా లేదు. ప్రాంతాలవారీగా వరినాట్లు వేయడంలో హెచ్చుతగ్గులు ఉన్నాయి. ప్రధానంగా తీవ్ర వర్షాభావంతో కొత్తవలసలో 6శాతం, విజయనగరం మండలంలో 7శాతం, భోగాపురం 10శాతం, పూసపాటిరేగ 17శాతం, బొండపల్లి, రామభద్రపురం మండలాల్లో 23శాతం మాత్రమే నాట్లు పడ్డాయి. వంగర, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, మెంటాడ, నెల్లిమర్ల, డెంకాడ, ఎస్.కోట మండలాల్లో 25 నుంచి 50శాతం లోపు నాట్లు వేశారు. ఉబాలు సంగతి పక్కనపెడితే కనీసం వరి నారును కూడా రక్షించుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల మోటారుల సాయంతో వరినారు, వేసినాట్లును బతికించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ వర్షపాతం పరిస్థితి

చాలా ఏళ్ల తరువాత ఖరీఫ్ సీజన్ ప్రారంభం అంటే జూన్ మొదటి వారం నుంచి వర్షాలు పడ్డాయి. జూన్‌లో 73 మిల్లీ మీటర్లు, జులైలో 23 మి.మీ అధిక వర్షాపాతం నమోదైంది. దీంతో, నారు మడులు తయారు చేసుకోవడం, మొక్కజొన్న, పత్తి తదితర పంటలకు సకాలంలో అదును కుదిరింది. దీంతో, రైతులు ఒకింత ఉత్సాహంతో దుక్కిపట్టి ముందుకు కదిలారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్న ఆశతో అప్పులు చేసి మరీ ఎరువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులంటూ లేకపోవడం పడిన నీరంతా సముద్రం పాలైంది. అలాగని చెరువులు కూడా పూర్తిగా నిండలేదు. తీరా ఆగస్టు నాటికి వరుణడు ముఖం చాటేశాడు. గత 13రోజుల్లో 72.మి.మీ వర్షం కురవాల్సి ఉండగా కేవలం 27మి.మీ మాత్రమే నమోదైంది. ఈ నెలలో 63.మి.మీ లోటు వర్షపాతం ఉండడంతో పాటు ఇటీవల కాలంలో ఎండలు మండుతున్నాయి. దీంతో, వ్యవసాయ బోర్లు ఉన్నచోట మినహా ఉబాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

సర్దు'పోటు'పై ఉపాధ్యాయుల ఆగ్రహం

జిల్లాలో 700 మంది మిగులు ఉపాధ్యాయులు ● నిర్ణయాన్ని విరమించుకోవాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నారు. పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను వేరే పాఠశాలలో సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు కౌన్సిలింగ్‌ను బహిష్కరించి నిరసన తెలిపారు. విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాటు చేయడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ పాఠశాల విద్యాశాఖ చేపడుతోంది. ఆగస్టు 9వ తేదీ వరకు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ఉత్తర్వులుజారీ చేసింది. అదే రోజు విద్యాశాఖ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో సమస్యల గురించి ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తావించినప్పటికీ వీటిని పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సీనియార్టీ అనే ఒక చిన్న డిమాండ్ మాత్రమే పరిగణనలోకి తీసుకుని జిఒ 117, 128 ఆధారంగా పనిసర్దుబాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ సర్దుబాటు వలన సుమారుగా స్కూల్ అసిస్టెంట్‌లు 200 మంది, ఎస్‌జిటిలు సుమారుర 400 మంది, పీడీలు 50 నుంచి 100 మంది వరకు వేరే పాఠశాలలకు తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 మంది విద్యార్థులకు మించి ఉంటే అక్కడికి స్కూలు అసిస్టెంట్లను సర్దుబాటు చేయనున్నారు. అయితే పని సర్దుబాటు ప్రక్రియ చేసేటప్పుడు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ప్రధానంగా జిఓ 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన జిఓ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో చేయడం వలన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇద్దరికీ నష్టం జరిగే అవకాశం ఉందని అంటున్నారు. వెంటనే సర్దుబాటు ప్రక్రియను ఆపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయం

పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్‌కు విల్లింగ్ అవకాశం కల్పించాలనీ, సీనియార్టీని లెక్కించినప్పుడు ప్యానల్ నంబర్ లేదా ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలని, పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. పని సర్దుబాటు చేసినప్పుడు ఉపాధ్యాయుడి సొంత మేనేజ్‌మెంట్‌లో గల ఖాళీలలో భర్తీ చేసిన తర్వాతే ఇతర మేనేజ్‌మెంట్లలో నియమించాలి. 70శాతం పైబడి అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను పనిసర్దుబాటు ప్రక్రియ నుండి మినహాయించాలని, 2025 ఏప్రిల్ 30లోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులను వారి పోస్టులను పని సర్దుబాటు నుండి మినహాయించాలని కోరుతున్నారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని, 6 నుంచి 10 తరగతులు 10 సెక్షన్లు దాటిన సందర్భంలో 2వ హిందీ, 2వ పిఎస్ పోస్టులను కేటాయించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జిఒ 60 మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని కోరుతున్నాయి. అవసరాన్ని బట్టి మాత్రమే మిగులు నిర్ణయించి సర్దుబాటు ప్రక్రియ చేయాలని, ప్రాధాన్యత కేటగిరీ కింద బదిలీ పొందిన వారికి డివిజన్ స్థాయి సర్దుబాటు నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాయి. స్టడీ లీవ్, మెటర్నీటి లీవు తదితర దీర్ఘకాల సెలవులో ఉన్న ఉపాధ్యాయులు ఉన్న చోట పని సర్దుబాటు నుండి మినహాయింపు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మాత్రమే ఎసి (పిఇ), పిఇటిలను అదే మండలంలో పని సర్దుబాటు చేయాలని, ప్లస్ టూ, సిబిఎస్‌సి పాఠశాలల్లో పని సర్దుబాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

డ్రైనేజి , తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో నున్న మురుగునీటి సమస్య , తాగునీటి సమస్య, విద్యుత్ తదితర అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వంద రోజుల, ఏడాది ప్రణాళికలు తయారు చేసినప్పటికీ మున్సిపాలిటీ పరిధిలో అత్యవసరంగా చేపట్టవలసిన కార్యక్రమాలు కొన్ని ఉంటాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు తో కలసి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ముందుగా ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ నగరం లో డ్రైనేజి సమస్య ఎక్కువగా ఉందని ప్రజల నుండి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. 21, 22 , 23 వార్డుల్లో కుళాయిలలో బురద నీరు వస్తోందని , మున్సిపల్ పరిధి లో ఉన్న పాఠశాలలలో పారిశుధ్యం , మధ్యాహ్న భోజనం మెరుగుపడాల్సి ఉందని , స్టూడెంట్స్, టీచర్స్ నిష్పతి కూడా తేడా ఉందని , పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, వీధి లైట్లు కొన్ని చోట్ల వెలగడం లేదని, మెడికల్ కళాశాలకు వెళ్ళే దారిలో వద్ద విద్యుత్ లైట్‌లు లేవని తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ మున్సిపాలిటీ లో మొత్తం డ్రైనేజి వ్యవస్థను అధ్యయనం చేసి ఎక్కడెక్కడ, ఏ మేరకు మరమ్మతులు అవసరం ఉన్నదీ వ్యక్తిగతంగా తనిఖీ నిర్వహించి సోమవారం లోగా యాక్షన్ ప్లాన్ తో నివేదిక నివ్వాలని కమిషనర్ మల్లయ్య నాయుడుకు ఆదేశించారు. అక్టోబర్ 2 లోగా నగరం లో ఎక్కడా డ్రైనేజి సమస్య లేకుండా పరిష్కరించాలని అన్నారు. నీటి ట్యాంక్ లను ప్రతి 15 రోజులకు ఒక సారి శుభ్ర పరచాలని సూచించారు. మున్సిపల్ అధికారులు వారం లో కనీసం 2 పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని , పారిశుధ్యాన్ని తనిఖీ చేయాలని డిఇఒ ప్రేమ కుమార్ కు ఆదేశించారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ కోసం పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం తో చేపట్టాలని, అందుకు తగు ప్లాన్ చేయాలనిఇ కలెక్టర్ తెలిపారు. అంబటి సత్రం వద్ద నున్న ఎలక్ట్రికల్ పోల్స్ తొలగించాలని, ఎలక్ట్రికల్ ఎస్ఇ లక్ష్మణరావు కు తెలిపారు. డ్రైనేజి వెంటనే నిర్మించాలని ఆర్అండ్ బి ఎస్ఇ విజయ్ రత్నంకు సూచించారు. సమావేశం లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబమూర్తి, పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణా మూర్తి, డిఇ అప్పారావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజా ప్రతినిధులు గ్రామ సభలకు హాజరు కావాలి : కలెక్టర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సెప్టెంబర్ మొదటి వారం నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈనెల 16 నుంచి జరగాల్సిన సదస్సులు తాత్కాలికంగా వాయిదా పడినట్లు తెలిపారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ లో పలువురు ఎమ్మెల్యేలు, రెవిన్యూ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వక్ఫ్, దేవాదాయ, అటవీ, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణ పై ముందుగా ప్రజల్లో అవగాహన కలిగించాలని, రెవిన్యూ కు సంబంధించి 5 రకాల సమస్యలపై వినతులు స్వీకరిస్తామని తెలిపారు. వచ్చే ప్రతి దరఖాస్తును మండల బృందాలు పరిశీలించాలని తెలిపారు. గ్రామసభ కు రెండు రోజుల ముందే గ్రామంలోని భూముల వివరాలతో కూడిన మ్యాప్ లను గ్రామ సచివాలయం, ఇతర గ్రామ స్థాయి కార్యాలయాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. గ్రామాల్లో ఇక ఎలాంటి రెవిన్యూ సమస్యలు ఉండకూడదని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, తదితర ప్రజా ప్రతినిధులు కనీసం ఒక్క రోజైనా పాల్గొనాలని, అలాగే భూ సమస్యల పై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు కూడా పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో ఎస్.కోట ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ , డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒలు సూర్యకళ , సాయి శ్రీ, శాంతి , అదనపు ఎస్‌పి అసమా ఫరీన్ , జిల్లా రిజిస్ట్రార్ కుమారి, సర్వే శాఖ ఎడి త్రివిక్రమ రావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు, స్వచ్చన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పులు జరిగితే విఆర్‌ఒలదే బాధ్యత

త్వరలో జరగనున్న రెవెన్యూ సదస్సులకు సన్నద్ధంగా ఉండాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈనెల 16 నుంచి ప్రారంభం కావాల్సిన రెవెన్యూ సదస్సులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయని, అయినప్పటికీ సదస్సుల నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. నోడల్ ఆఫీసర్లు, తాహాశీల్దార్లు, విఆర్‌ఒలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకూడదని, తప్పులు జరిగితే విఆర్‌ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఖచ్చితంగా ఉదయం 9 గంటలకే సదస్సు ప్రారంభం కావాలని, 5వేల జనాభా కంటే ఎక్కువగా ఉన్న గ్రామాల్లో సాయంత్రం 5 గంటలు వరకు ఉండాలని చెప్పారు. మండల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో తాహాశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒ, సర్వేయర్‌తో బాటు, రిజిస్ట్రేషన్, దేవాదాయశాఖ, వక్ఫ్‌బోర్డు, అటవీశాఖాధికారులు కూడా సదస్సులకు హాజరవుతారని తెలిపారు. సదస్సుల నిర్వహణలో, రికార్డుల నమోదులో ఎక్కడా ఎటువంటి పొరపాటు జరగకూడదని, తప్పులు జరిగితే విఆర్‌ఒలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈనెల 16 స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా జిల్లాలో పర్యటించనున్నారని, ఆయన ఏదో ఒక గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, భూ రికార్డులను పరిశీలిస్తారని తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యఅతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నారని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటన లో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు పెరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అనంతరం మంత్రి వారి సందేశాన్ని అందిస్తారని తెలిపారు.

17 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

16న ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 17నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జిల్లా కేంద్రంలో జరగనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెఎ నాయుడు, నున్నా సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ పోటీలు వివరాలను తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పోటీలకు ముందుగా అర్హత పోటీలు 16న నిర్వహిస్తామన్నారు.ఈ పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి ప్రారంభిస్తారని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు

ఈనెల 9, 10 తేదీల్లో విజయనగరం లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ తైక్వాండో పోటీలలో జిల్లాకు 9బంగారు పథకాలు, 1 రజిత పథకం, 3 కాంస్య పథకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న క్రీడాకారులను ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి అభినందించారు. ఈ పోటీల్లో రెండవ స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో గుంటూరు జిల్లా విజేతలుగా నిలిచారు. ఈనెల 18 నుండి 20వ తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రంలో ఔరంగబాద్‌లో జరుగు 41వ జాతీయ జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ప్రథమ బహుమతి విజేతలు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందనలు తెలియజేస్తూ జాతీయస్థాయిలో పతకాలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డివి చారి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు సహారా బాధితుల ర్యాలీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పేద ప్రజలు, చిరు వ్యాపారులు, రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు సహారాలో దాచుకున్న డబ్బును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సహారా బాధితుల సంఘం పిలుపులో భాగంగా బుధవారం పట్టణంలో భారీ ర్యాలీఅనంతరం దేవిబొమ్మ కూడలిలో మానవహారం నిర్వహిస్తామని నిర్వహిస్తున్నట్లు సహర బాధితుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం. సూరిబాబు తెలిపారు. సహారా ఖాతాదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి ర్యాలీలో పెద్ద ఎత్తున ఖాతాదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీ తెలిపారు.

15 నుంచి చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పద్మవిభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలను ఈనెల 15 నుంచి 22వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు త్యాడ రామకృష్ణారావు (బాలు) తెలిపారు. 22న సర్వమత ప్రార్ధనలు, మెగా రక్తదాన శిబిరం, కేక్ కటింగ్ జరుగుతాయని తెలిపారు. సమావేశంలో మాతా గాయత్రీ, చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు పత్తిగిల్లి వెంకటరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి అన్న క్యాంటీన్లు పున: ప్రారంభం

నియోజకవర్గ సమావేశంలో అశోక్‌గజపతిరాజు : టిడిపిలో చేరిన రొంగలి పోతన్న

ప్రజాశక్తి-విజయనగరం కోట

పేదల ఆకలి తీర్చాలన్న ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా ఆగస్టు 15 నుండి అన్న క్యాంటీన్ లను పునః ప్రారంభిస్తున్నామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. అన్న క్యాంటీన్‌ల కోసం మన పార్టీ కి చెందిన వారు, అదేవిధంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు విరాళాలు ఇవ్వడం అభినంద నీయమని అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వైసిపి నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ రొంగలి పోతన్న టిడిపిలో చేరారు. అశోక్‌గజ పతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సమక్షంలో ఆయన టిడిపి కండువా కప్పుకున్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ గత వై సిపి ప్రభుత్వ హయాంలో భూములకు సంబంధించి అనేక అవకతవకలు జరిగాయని, ప్రైవేట్ భూములలో అనేక అక్రమాలు చేసారని, వీటన్నింటికి పరిష్కారం చేసి ప్రజలను న్యాయం చేయాలన్న ఉద్దేశంతో సెప్టెంబర్ మొదటి వారం నుంచి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. రెవిన్యూ సదస్సులలో అధికారులు ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారని, కాబట్టి ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ విషయమై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రభుత్వా స్పత్రిలో సమస్యలు పరిష్కారానికి, నాగావళి - చంపావతి నదుల అనుసంధానంలో భాగంగా తోటపల్లి రిజర్వాయర్ నుండి గడిగెడ్డ రిజర్వాయర్ కు నీరు తీసుకువచ్చి తద్వారా నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు, విజ్జి స్టేడియం లో క్రీడా పాఠశాల పునః ప్రారంభించడం , క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా చాలావరకు సమస్యల పరిష్కారం దిశగా పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

రొంగలిపోతన్నను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌గజపతిరాజు

గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మౌలిక వసతుల కల్పనలో భాగంగా మారుమూల గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. బొబ్బిలి మండలం గోపాలనాయుడిపేట పంచాయితీ పరిధిలోని సియోనువలస, చిన అక్కివలస, రామన్నదొరవలస, కృపావలస, దీవెన వలస గిరిజన గ్రామాల్లో సుమారు 60 కుటుంబాలు, దత్తిరాజేరు మండలం షికారుగంజి పంచాయితీ పరిధిలోని ఎస్‌టి కొత్తవలస గ్రామంలో 74 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామస్తులు విద్యుత్ సౌకర్యం కావాలని కోరడంతో, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ తన ఛాంబర్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండటం వల్ల, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా, గ్రామస్తులను ఒప్పించి వేరే చోట వారికి స్థలాలు కేటాయించి, అన్ని వసతులూ సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే సమస్యను ప్రభుత్వానికి కూడా నివేదించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఫారెస్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం తదితరులు పాల్గొన్నారు.

పురిటిపెంట రైల్వేగేటు వద్ద

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

ఎంపి కలిశెట్టికి సిపిఎం నాయకులు వినతి

ఎంపికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం మండలంలోని మెంటాడ రోడ్డులో పురిటి పెంట రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుకు సిపిఎం నాయకులు జి.శ్రీనివాసరావు, బి.రాంబాబు, ఆర్.రాములు వినతినిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజపతి నగరం నుండి మెంటాడ, ఆంద్ర వెళ్లే దారిలో పురిటి పెంట గ్రామం వద్ద రైల్వేగేటు ఉందని, ఇక్కడ రైల్వేలైన్లు పెరగడం వల్ల గేటుపడి గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం ఆగిపోయి ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉందని చెప్పారు. గేటు రోజులో ఎక్కువ సార్లు వేసి ఉంచడం, ఎక్కువ సమయం కారణంగా ప్రయాణికులు కొన్నేళ్లగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గజపతినగరం, మెంటాడ, అనంతగిరి మండలాల ప్రజలు, మెంటాడ, ఆంద్ర వైపు వెళ్లే ఇతర ప్రయాణికులు, రోగులు, విద్యార్థులు, రైతులు, కూలీలు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు గేటు పడగానే రద్దీతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రస్తుతం సాంకేతిక రంగం అభివద్ధి చెందిన కాలంలో కూడా ప్రయాణికులు ఇబ్బందులు పడటం వేదనకు గురిచేస్తుందన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదని, ఇప్పటికైనా స్పందించి ఫ్లైఓవర్ బ్రిడ్జినిర్మాణం చేపట్టాలని కోరారు. ఎంపి కలిశెట్టి సానుకూలంగా స్పందించి రైల్వేశాఖా మంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం

ఎంఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వాలంటీర్లు ఎస్.కల్యాణి, వై.నరేంద్ర కుమార్ 2023-24 విద్యాసంవత్సరానికి యూనివర్శిటీ, జిల్లా స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు ఎయు ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దత్తత గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరాలు నిర్వహించడం, మొక్కలు నాటడం, రక్తదానం చేయడం, ఢిల్లీలోజరిగిన ఘన తంత్ర వేడుకలకు హాజరు కావడం వల్ల కల్యాణికి యూనివర్శిటీ స్థాయి, పచ్చదనం, పరిశుభ్రత, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినందుకు నరేంద్రకు జిల్లా స్థాయి అవార్డు లభించాయి.

ఈ సందర్భంగా వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.చంద్రశేఖర్, పిఒలు శ్రీకాంత్, చిన్నంనాయుడు, పిఎన్‌బి శర్మ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

బొబ్బిలి: మున్సిపాలిటీలో దోమలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎల్. రామలక్ష్మి చెప్పారు. గొల్లపల్లిలో మంగళవారం దోమలు నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమలను నివారిస్తే వ్యాధులను నివారించ వచ్చునన్నారు. కాలువలలో, నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలను కోరారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

బొబ్బిలి: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. పట్టణంలోని జయప్రకాష్ పాఠశాల రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకపోతే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను కోరారు. రోడ్డు నిర్మాణానికి నిధులు చాలకపోతే అదనంగా కేటాయించాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయనతో మున్సిపల్ డిఇ సునీల్ కుమార్, ఎఇ రవికుమార్, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక శాఖ గ్రంథాలయానికి మేడిశెట్టి జయరాం, కెనరా బ్యాంక్ మేనేజర్ తిరుపతిరావు సంయుక్తంగా రూ.4వేలు విలువ చేసే వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను మంగళవారం బహుమతిగా అందించారు. వీరికి గ్రంథాలయం తరుపున పాఠకులు, శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

బేబినాయనను కలిసిన తూర్పుకాపు నేతలు

బొబ్బిలి: ఎమ్మెల్యే బేబినాయనను తూర్పుకాపు సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం కోటలో కలిసి సత్కరించారు. తూర్పుకాపు సంక్షేమ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే బేబినాయనను నాయకులు రౌతు రామమూర్తి, ఎస్.సత్తి, సురేష్ కోరారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల పరిశీలన

వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారం ప్రాథమిక, వావిలిపాడు ప్రాథమిక, జిల్లా పరిషత్తు పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు మంగళశారం పరిశీలించారు. టాయిలెట్స్, పాఠశాల ఆవరణ, విద్యార్థులకు ఇచ్చిన కిట్లు పరిశీలించారు. ఇంగ్లీషు, తెలుగు పాటాలు చదివించడం, వర్క్ బుక్స్, డైరీలు, చతుర్విధ ప్రక్రియలు, మనబడి మన భవిష్యత్తు పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సన్మానం

వేపాడ: మండలానికి సార్వత్రిక ఎన్నికల నిమిత్తం శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎంపిడిఒ కె. నిశ్చల మరల సొంత జిల్లాకు వెళుతున్న సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఆమెను దుశ్శాలువా కప్పి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమా, కార్యాలయ సిబ్బంది, 18 గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ మండల అధ్యక్షునిగా కిలపర్తి

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ మండల అధ్యక్షునిగా మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన కిలపర్తి ముత్యాల నాయుడుని ఎంపిక చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర చెరువు పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు చక్రవర్తి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా అధ్యక్షులు ఇప్పిలివలస గోపాల్‌రావు సూచనల మేరకు తనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌పోటీలకు విద్యార్థి ఎంపిక

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అల్లాడ కాత్యాయని రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ పొట్నూరు శ్రీరాములు, లోకి రెడ్డి కృష్ణ తెలిపారు. ఈనెల 20వ తేదీన విజయనగరంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఉమెన్ డబుల్స్ పోటీలలో పి. మౌనికతో కలిసి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. గెలుపొందిన కాత్యాయినికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ కాత్యాయని ఆగస్టు 16 వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జరగబోవు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

రేగిడి: మండలంలోని ఉంగరాడ యూనిట్ అంబకండి గ్రామంలో ఎన్ఎఫ్ఎ రేఖా ఎన్‌పిఎం షాప్‌ను ప్రారంభించి ప్రకృతి వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి నవధాన్యాల కషాయం ఎంతో మేలు చేకూరుతుందన్నారు. తెగుళ్ళ, పురుగులు నివారణకై కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉంచుతామన్నారు. మొక్క ఎదుగుదలకు గ్రోత్ ప్రమోటర్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ ఎల్ సురేష్, ఐసిఆర్‌పిలు కె.వరలక్ష్మి, పి.లక్ష్మీనాయుడు, గుండాల రవి, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలు పంపిణీ

బొబ్బిలి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మున్సిపల్ ఉద్యోగులకు జాతీయ జెండాలను మంగళవారం పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేసేందుకు జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్నట్లు రాజు చెప్పారు. బుధవారం పట్టణంలోని 150 అడుగుల జెండాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

వేపాడ: మండలంలోని వీలుపరితి గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు గ్రామానికి చేస్తున్న సేవలను గుర్తించి పంచాయతీ పాలకవర్గం శాలువా కప్పి మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి. ఉమా, గ్రామ సర్పంచ్ సేనాపతి లీల, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు, మండల పరిధిలో గల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సీతం'లో క్యాంపస్ టు కార్పొరేట్ కార్యశాల

విజయనగరం: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం జరిగింది. మెంటార్ లైఫ్ కోచ్, హెచ్ ఆర్ డి ట్రైనర్ అలజంగి ఉదయ్ కుమార్ అలజంగి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల మైండ్ సెట్ ఎలా ఉంటుందో వివరించి వారిని మోటివేట్ చేశారు. సక్సెస్ రేట్ ఎలా ఉంటుందో ఉదాహరణలతో సహా వివరించారు. విద్యార్థులలో సామాజిక నైపుణ్యాలతో సహా శారీరక మానసిక శక్తుల గురించి అవగాహన కల్పించారు.

కెఎల్‌పురంలో కమిషనర్ పర్యటన

విజయనగరం టౌన్: నగరంలోని 45వ డివిజన్ కెఎల్ పురం ప్రాంతంలో కమిషనర్ ఎంఎం నాయుడు మంగళవారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ ఏ విధంగా ఉందో తెలుసుకున్నారు. మురికి కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పరిస్థితిని గమనించారు. అక్కడున్న పారిశుధ్య పర్యవేక్షకుడు, కార్యదర్శి తక్షణమే సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్న తీరును ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తడి పొడి చెత్తలను వర్గీకరించి చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని చెప్పారు. కార్యక్రమంలో తాళ్ళపూడి పండు, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

17న ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం కోట: ఎపియుడబ్ల్యుజె 67వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 17న ఐఎంఎ హాలులో జరగుతుందని ఆ సంఘం జిల్లా శాఖ యూనియన్ తెలిపారు. మంగళవారం వారు జిఎస్‌ఆర్ హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం, సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కె.శ్రీనివాసరావు, జి.సంధ్యారాణి, రెండు జిల్లాలో ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు అల్లు సూరిబాబు, జిల్లా కార్యదర్శి పంచాది అప్పారావు, నాయకులు రాధాకృష్ణ, మహాపాత్రో పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు విరాళం

ప్రజాశక్తి- విజయనగరంకోట

అన్న క్యాంటీన్ల నిర్వహణకు కడియాల నరసింహారావు రూ.50వేలు, పి.సీతారామ రాజు రూ.20 వేలు చొప్పున విరాళాలను కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు చెక్కుల రూపంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి సమక్షంలో మంగళవారం అందజేశారు. ఇంతవరకు అన్న క్యాంటీన్ల కోసం 25 మంది దాతలు 5 లక్షల 48 వేల 253 రూపాయలను అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టించవచ్చు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పంచాయతీల్లో నిర్మాణం చేసిన (ఎస్‌డబ్ల్యూపిసిల) చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా సంపద సృష్టించవచ్చని ఎంపిడిఒ రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శిలకు మంగళవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచులు, కార్యదర్శులను పూసపాటిపాలెంలో అమలవుతున్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలనకు తీసుకువెల్లారు. ఆ కేంద్రంలో తడిచెత్త పొడిచెత్త వేరుచేయడం, సేంద్రియ ఎరువును తయారు చేయడం, వాటిని అమ్మకంను ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు వివరించారు. దీని నిర్వాహన వల్ల గ్రామంలో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. గ్రామంలో వ్యర్థాలను సేకరించి సంపద సృష్టిస్తున్న పూసపాటిపాలెం సర్పంచ్ రౌతు స్వామినాయుడును అధికార్లు అభినందించారు. సర్పంచులంతా ఈ పద్ధతి పాటించి చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ పరిశీలనలో సర్పంచులు, టి. సీతారాం, డి. గనేష్, ఇజ్జురౌతు అప్పలరాజు, బాలా రామలక్ష్మి, లంకలపల్లి గాయత్రి, శంకాబత్తుల సత్తిబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఎస్‌డబ్ల్యుసిపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ఎస్‌డబ్ల్యు కేంద్రాన్ని సందర్శించిన సర్పంచులు

కొత్తవలస: కొత్తవలసలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచులు మంగళవారం సందర్శించారు. మండలంలో గల సర్పంచులకు మూడు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ క్షేత్ర పర్యటన ఎంపిడిఒ రమణయ్య ఆధ్వర్యంలో ఇఒపిఆర్‌డి కె.ధర్మారావు సమక్షంలో నిర్వహించారు. సర్పంచులకు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వల్ల, గ్రామ పంచాయతీలకు ఎటువంటి లాభం చేకూరుతుంది, ఎలా వీటిని నిర్వహించాలో క్షేత్ర స్థాయిలో వివరించారు. గ్రామ సర్పంచులతో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో రిసోర్స్ పర్సన్ కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఎస్‌డబ్ల్యు కేంద్రాలను పరిశీలిస్తున్న సర్పంచులు

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో రెండవ రోజు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ నిచ్చల పలు సూచనలు చేశారు. ఇఒపిఆర్‌డి ఉమా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి చెందాలంటే తప్పని సరిగా పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత తీసుకో వాలన్నారు. ప్రధానంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, తాగునీరు సక్రమంగా అందించడం, గ్రామ సచివాలయానికి వచ్చిన అర్జీదారులు సమస్యలను గ్రామ సచివాలయంలోనే పరిష్కారించేలా కృషి చేయాలన్నారు.

రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగులు

రోడ్లపైనే గజరాజులు

ప్రజాశక్తి - వంగర

అటవీ ప్రాంతంలో సంచరించాల్సిన గజరాజులు గ్రామాలలో రోడ్ల పై సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నెల 11న మండలంలోని వివిఆర్‌పేటలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు ఆ పరిసర ప్రాంతంలోనే ఉండి మంగళవారం ఉదయం వివిఆర్ పేట రాజులు గుమ్మడ ప్రధాన రహదారిపై సంచరించాయి. ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి అడ్డంగా ఉండటంతో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగింది. కొంత సమయం తర్వాత అవి పొలాల్లోకి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పొలాల్లోకి వెళ్లిన ఏనుగులు మొక్కజొన్న, చెరకు, అరటి తోటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

భూకబ్జా దారుల నుంచి కాపాడండి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో ఉద్దంగి రెవెన్యూ పరిధిలోగల గెడ్డ పోరంబోకు, కొండ పోరంబోకు, బంజరు భూములను కబ్జాచేస్తున్న భూ భకాసురుల నుంచి కాపాడాలని ఉద్దంగి నీరుపేదలు మంగళ వారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. గత 25ఏళ్లుగా సాగు చేస్తున్న భూములలో మామిడి, టేకు మొక్కలు నాటిన పాచిపెంట సత్య నారాయణ ఉద్దంగి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 103లో 2.50 ఎకరాల నుంచి ఫల సాయం అనుభవిస్తున్నాడు. గతేడాది భూకబ్జాదారులకు గుమస్తాగా పనిచేసిన పోరాం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సాగులో ఉన్న రైతులను బెదిరిస్తూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడని ముగడ గౌరమ్మ డిప్యూటి తహశీల్దార్ వెంకట్రావు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అదే రెవెన్యూ సర్వే నంబర్ 70లో కుర్రాయి తిరపతినాయుడు పేరుతో 24 సెంట్లు జిరాయితీ ఉందని ఆయన భూమిలో భూ కబ్జాదారుడు కంచి వేసి ఆక్రమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భూమిలో కంచి వేయడానికి మీకు ఎటువంటి అనుమతి లేదు కదా అని కంచెను తొలగిస్తే వికలాంగుడైన తిరుపతి నాయుడుతో పాటు ఆయన బావమరిది తాడ్డి వెంకటరమణలపై ఆంధ్ర పోలీసు స్టేషన్‌లో కొబ్బరికాయల దొంగతనం చేసినట్లు కేసు పెట్టారని చెప్పారు. ఇటువంటి భూ భకాసురుల నుంచి తమ భూములను తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నాలో రైతులు పాల్గొన్నారు.

ఉద్దంగి రైతులు ఆందోళన

వినతి పత్రాన్నిస్తున్న రైతులు

సమస్యల పరిష్కారానికే పనిచేస్తాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కారానికే పనిచేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు హాజరయ్యారు. ఎంపిపి అంబళ్ల సుధారాణి అధ్యక్షత వహించిన సమావేశంలో సభ్యులు, అధికార్లు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. పలువురు సభ్యులు 2014 నుంచి కొంత మంది లబ్ధిదార్లకు ఇంటి బిల్లులు మంజూరు కాలేదని, నాడు నేడు పథకంలో పని చేసిన ప్రభుత్వ పాఠశాల బిల్లులు కూడా ఇంతవరకు ఇవ్వలేదని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను గుర్తించి పరిష్కారానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, రెవెన్యూ సదస్సుల్లో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.రామారావు, తహశీల్దార్ పి.సుదర్శన రావు, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాలు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రభుత్వ స్థలాల అక్రమాలపై నగర పంచాయతీ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ అలాబాన వీధి సర్వే నంబర్ 312లోని ప్రభుత్వ స్థలంలో పి.కిరణ్ అనే వ్యక్తి గత 6 సంవత్సరాల క్రితం ఇళ్లు నిర్మాణం చేయడంతో బాటు రస్తాకి అడ్డంగా పూరి గుడిసె వేశారని, పలుమార్లు ఫిర్యాదు చేస్తే తిరిగి ఎదురు దాడి చేస్తున్నారని ఈ స్థలంపై సర్వేయర్, ఆర్ఐ విచారణ జరిపి ప్రభుత్వ స్థలంగా గుర్తించారని ఇంతవరకు చర్యలు చేపట్టలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. కీర్తి వీధి దళిత కాలనీ సర్వే నంబర్ 90లో దొంగ పట్టాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, మిమ్స్ ఎదురుగా సర్వే నంబర్ 66లో ప్రభుత్వ స్థలం రైల్వే ట్రాక్ పక్కన దొంగ పట్టాలు ఎలిపిసి సృష్టించి 8 నుంచి 13 ఇళ్లు అక్రమంగా నిర్మాణం చేశారని, చంద్రబాబు నగర్ కాలనీ సర్వే నంబర్ 60లో 119, 120 ఫ్లాట్‌లలో ఎంఆర్ఓ సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాద చేశారు ఈ అక్రమాల పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఓపెన్ స్కూల్ విధానాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎం. రాధిక అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ విధానంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభ్యాసం అర్థాంతరంగా నిలిచినవారికీ, నిరక్షరాస్యులుగా ఉండి మధ్యలో చదువు నేర్చుకుని ఉన్నతాభ్యాసం చేయదలచుకున్న వారికి ఈ ఓపెన్ స్కూల్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా ఈ విధానంపై అవగాహన కల్పించి 10వ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో విద్యార్థులను చేర్పించాలని ఆమె కోరారు. ఎంఇఒ బి. పాపినాయుడు ఆపస్ మండల కోఆర్డినేటర్ శ్రీరాములు మాట్లాడుతూ 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు 10వ తరగతిలో ప్రవేశించడానికి అర్హులని, 10వ తరగతి ఉత్తీర్ణులై 19 సంవత్సరాలలోపు వయస్సు గల వారు ఇంటర్మీడియట్ ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఫీజు రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 9494775654, 9441713431 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధి హామీ ఎపిఒ, వెలుగు ఎపిఎం తదితరులు పాల్గొన్నారు.

గోతులో పడిపోయిన ద్విచక్ర వాహనదారుడు

బొబ్బిలిలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా వర్షం లేకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుతున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేద తీరారు. వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, చెరకు, గోగు పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

చెరువును తలపిస్తున్న పూల్ బాగ్ రోడ్డు

పట్టణంలోని పూల్ బాగ్ రోడ్డు చెరువును తలపిస్తుంది. పట్టణంలో వర్షం కురవడంతో పూల్ బాగ్ రోడ్డుపై ఉన్న గోతులలో వరదనీరు చేరడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతులలో వరదనీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. రోడ్డు బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో గల హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించామని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వి.చరణ్, కె. రమేష్ తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా వివిధ సేవా కార్యక్రమాలు, బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల పట్ల ఆసక్తి పెంపొందించడానికి ఏటా స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆశక్తి వున్నా ప్రభుత్వాల ప్రోత్సాహం లేక పోవడంతో మన దేశం తరాతరాలుగా క్రీడారంగంలో వెనుకబడి పోతుందన్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో రోజు ఎలాగైతే పాఠాలు భోదిస్తారో, ప్రతీ రోజు ఆటల ఆడేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అభినం దనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు ఎ అప్పలమ్మ, మండల కమిటీ సభ్యులు రత్న, కార్తీక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల సాయంతో ఆపరేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో దోమల నియంత్రణకు డ్రోన్ల సహాయంతో ప్రయోగాత్మకంగా చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్ విజయవంతమైంది. అయ్యకోనేరు ప్రాంతంలో మంగళవారం తొలిసారిగా డ్రోన్ ఆపరేషన్ కార్యక్రమం కమిషనర్ ఎంఎం నాయుడు ఆధ్వర్యాన నిర్వహించారు. ప్రయోగించిన డ్రోన్ అయ్యకోనేరు చుట్టూ తిరిగి బిటిఐ ఆయల్ పిచికారిని చేపట్టింది. వాస్తవానికి డ్రోన్ లో 10 లీటర్ల పిచికారి మందు వేసే సౌలభ్యం ఉన్నప్పటికీ, ప్రయోగాత్మకంగా చేపడుతున్న కారణంగా 6 లీటర్లు మాత్రమే ఏజెన్సీ నిర్వాహకులు వేశారు. మొత్తం పిచకారి మందు పరిపూర్ణంగా వెదజల్లిన డ్రోన్ దోమల నియంత్రణకు సహాయ కారిగా నిలిచింది. ఈ సందర్భంగా కమిషనర్ ఈ కార్యక్రమం విజయ వంతం అయినందున చెరువులు, కుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో డ్రోన్ల సహాయంతో బిటిఐ ఆయిల్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్‌ను చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసంనీటి నిల్వ కేంద్రాలను గుర్తించాలన్నారు.

డ్రైవర్లందరికీ వాహనమిత్ర ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి 2 నెలలైనా వాహన మిత్రపై ఎలాంటి క్లారిటీ లేదని , లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కు వాహన మిత్ర ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్ మోహన్ రావు, బి. రమణ డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్ పథకాన్ని స్వాగతిస్తున్నామని, దీనివల్ల ఆటో క్యాబ్ డ్రైవర్లకు జరిగే నష్టాన్ని ఎలా భర్తీ చేస్తారో ప్రకటిం చాలన్నారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం అమలకు ఏడాదికి రూ.250 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసిన ప్రభుత్వం, ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమ స్యపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కరోనా నుంచి ఆటో డ్రైవర్ల పై ఉన్న కేసులు, ఫైన్లు, ఈ చలానాలు రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, ఆటో, వాహనాలు కొను గోళ్లు, స్పేర్ పార్టు తదితర వాటిపై 1 శాతం సెస్ విధించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు మూత పడి ఉపాధి అవకాశాలు లేక చదువుకున్న ఆధునిక యువత స్వయం ఉపాధిగా ప్రజా, సరుకు రవాణా రంగాన్ని ఎంచుకుంటుందన్నారు. రుణ సదుపాయం లేక ప్రైవేట్ ఫైనాన్షియల్ దగ్గర బందీలు అవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఈనెల 20 లోపు ప్రజా ప్రతినిధులను, అధికారులను కలిసి వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. సమా వేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం .రమణ,ఆటో యూని యన్ నాయకులు బి. పాపారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రాజ బంగారమ్మ గుడిలో చోరీ

నెల్లిమర్ల: జరజాపుపేట రాజ బంగారమ్మ గుడిలో చోరీ జరిగింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామ దేవత రాజ బంగారమ్మ గుడిలో సోమవారం రాత్రి తలుపులు బద్దల గొట్టి దొంగలు హుండీ ఎత్తుకెళ్ళి నగదు దోచుకున్నారు. హుండీలో ఉన్న సుమారు రూ.50వేల నగదు దొంగిలించి చిల్లర పైసాలతో సహ పగలు గొట్టిన హుండీని గుడి పక్కనే వదిలేశారు. స్థానికులు తెల్లవారిన తరువాత గుడి వద్దకు వెళ్లి చూడగా హుండీ గుడి పక్కనే దర్శనమిచ్చింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల గుడి పునర్నిర్మాణం చేసి ప్రారంభించి అప్పట్లో హుండీ లెక్కించగా పది రోజులలకు గాను రూ.50వేలు ఆదాయం వచ్చింది. రెండు నెలల బట్టి హుండీలు తెరవలేదని ఈ రెండు నెలలకు 50వేలకు పైగా నగదు హుండీలో చేరి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గుడి పునర్ని ర్మాణం తరువాత భక్తుల సంఖ్య పెరిగి ఆదాయం ఎక్కువగా ఉంటుందని దొంగలు పసిగట్టి దోపిడీకి పాల్పడి ఉంటారని అంచనా వేస్తున్నారు.

వరుస దొంగతనాలతో ఆందోళన

మండలంలోని వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం మొయిద జంక్షన్‌లో మహిళ మేడలో అగంతకుడు బంగారం నగలు లాక్కొన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం మెంటాడ గ్రామానికి చెందిన బాధిత మహిళ కొండ వెలగాడ బంధువులు ఇంటికి శుభకార్యానికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో మొయిద జంక్షన్లో పూలు కొనుక్కొని తన స్వంత వాహనంలోకి వెళ్తుండగా అగంతకుడు ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి మహిళ మేడలో బంగారం అభరణాలు తెంపుకొని పరారయ్యాడు. గతంలో కొత్త పేటలో రెండు ద్విచక్ర వాహనాలు నెలల వ్యవధిలో దొంగతనానికి గురయ్యాయి. వరుస దొంగ తనాలతో మండల వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గరివిడి: స్థానిక ఫేకర్ పరిశ్రమ సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో డిఎఫ్ఎన్ కాలనీకి చెందిన కోండ్రు కరుణ (26) అనే యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడు కింతాడ రేవంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. డిఎఫ్ఎన్ కాలనీకి చెందిన కరుణ, రేవంత్, నూకరాజు ముగ్గురూ బైక్ మీద వెళుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో కోండ్రు కరుణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే బైక్‌పై ఉన్న రేవంత్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. మరో యువకుడు నూకరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడు గరివిడిలో సెల్‌పాయింట్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఉయ్యాలే ఉరితాడై..

జామి: పిల్లలు కోసం కట్టిన ఉయ్యాల... అతడికి ఉరితాడయ్యింది. అనుకోకుండా ఉయ్యాల బిగుసుకుని ప్రాణమే పోయింది. జామి గ్రామం దళిత కాలనీలో చోటు చేసుకున్న ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. దళిత కాలనీకి చెందిన కుంచంగి రామచంద్రరావు (37)కు ఉయ్యాల బిగుసుకుని మృతి చెందాడు. ఇంటిలో మంచంపై పడుకొని తలను పిల్లల కోసం కట్టిన చీర ఉయ్యాలలో పెట్టి అటూ ఇటూ ఊపగా తల ఉయ్యాలలో ఇరుక్కుని ప్రమాదవశాత్తు మంచం పై నుండి కిందపడి ఊపిరాడక చనిపోయినట్లు భార్య ఘాన్సీ పోలీసులకు తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఐ వీరబాబు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఎస్. కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శృంగవరపుకోట: మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ అమ్మపాలెం గ్రామానికి చెందిన దేవపురపు రవణమ్మ (35) చికిత్స పొందుతూ మరణించిందని ఎస్ఐ గంగరాజు తెలిపారు.ఆ గ్రామానికి చెందిన దేవపురపు దేముడు ఈనెల 11వ తేదీన భార్య పై అనుమానంతో గొడవ పడి ఆమెను కర్రతో తలపై కొట్టగా కొట్టాడు. చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా ఆమె అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించిందని భర్త దేవుడిపై కేసు నమోదు చేసి రిమాండకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి చేసిన నిందితుల అరెస్టు

విజయనగరం కోట: ఈనెల 8న అర్ధరాత్రి రైల్వేస్టేషన్ సమీపంలో భార్యాభర్తలపై దాడిచ చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. 8వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పెందుర్తికి చెందిన భార్యాభర్తలు విజయ నగరం రైల్వే స్టేషన్‌లో పెందుర్తి వెళ్లేందుకు ట్రైన్ లేకపోవడంతో టీ తాగేందుకు బయటకు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకు వచ్చి, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అడ్డు వచ్చిన భర్తను దారుణంగా కొట్టి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఈనేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులైన కోరాడ దండు, బొగ్గుసూరిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

బొబ్బిలి: స్థానిక జెండావీధిలో కుక్కలు దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. జెండావీధికి చెందిన కర్రోతు నరేంద్ర కుమారుడు సాత్విక్ స్కూలుకు వెళ్తుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి కుడి చెయ్యిపై కరవడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుక్కల దాడిలో గాయపడిన సాత్విక్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. వారం రోజుల క్రితం కూడా ఒక వ్యక్తిపై కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు చెపుతున్నారు. పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. కుక్కలను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

BEFORE THE HONOURABLE COURT OF THE JUDGE; FAMILY COURT AT VISAKHAPATNAM
F.C.O.P. No. 594 / 2022

Between:
Saripalli Ramanamma ...Petitioner
And:
Saripalli Anil Kumar ...Respondent

NOTICE BY WAY OF PUBLICATION

To
Respondent:
Saripalli Anil Kumar,
S/o. Late Satyam,
D.No. 3-27, Pedda Veedhi,
Chellam Naidu Valasa Village,
Sithanagaram Mandal
Vizianagaram District.

Please take notice that the above FCOP filed by the petitioner against the respondent by dissolving their marriage and the same stands posted to **30-08-2024** for your appearance, and you should attend before the Honourable Court either personally or through an advocate on the above mentioned date at about **10-30 A.M.** failing which the matter will be decided in your absence.

(By order of the Court)
M.RAVI KUMAR
Advocate,
Visakhapatnam.

Visakhapatnam,
Dt: 13-08-2024